నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | SIDDIPET



మెదక్ పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు పక్కన ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న రవాణా, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ మనుచౌదరి, ఎస్పీ అనురాధ

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

- మెదక్ జిల్లాలో పక్కాగా పథకాలు అమలు
- అదుపులో శాంతిభద్రతలు.. మత్తుపై ఉక్కుపాదం
- హామీలన్నీ అమలు చేస్తున్నాం..
- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు
- మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ప్రదానం

మెదక్,ఆగస్టు 15(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని, హామీలన్నీ అమలు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. మెదక్‌లోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కేశవరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రసంగించారు. మెదక్ జిల్లాలో అన్ని పథకాలు, కార్యక్రమాలు సజావుగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1.07 కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే వంట గ్యాస్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,21,207 మంది వినియోగదారులకు జీరో బిల్లును జారీ చేసినట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో 74,342 మంది రైతులకు 473.76 కోట్ల రూపాయల పంట రుణాల మాఫీ జరిగినట్లు కేశవరావు తెలిపారు. మిగతా పథకాలను జిల్లా యంత్రాంగం విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, డ్రగ్స్, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం, వాటి రవాణా, అమ్మకంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు, నకిలీ విత్తనాలు, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటి గురించి పోలీస్ కళాబృందాలతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కమ్యూనిటీ ప్రాజెక్ట్ కింద 1907 సీసీ కెమెరాలు, నేను సైతం కార్యక్రమంలో భాగంగా 1772 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. సీసీ కెమెరాలు జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి అనుక్షణం పర్యవేక్షిస్తున్నట్లు కేశవరావు తెలిపారు. వేడుకల్లో విద్యార్థినీవిద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శకటాలు, ఫైర్ ఇంజిన్ ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ద్విచక్రవాహనాలు అందజేస్తున్న కేశవరావు, పక్కన ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్ రాహుల్




ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కేశవరావు, పక్కన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

# అందరి అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- సిద్దిపేట జిల్లాలో రెండు విడతల్లో 81 వేల మంది రైతులకు రుణమాఫీ
- మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు కృషి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 15: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన, పారదర్శక పాలనతో పాటు సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 2.23 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకున్నట్లు తెలిపారు. దీంతో మహిళలకు రూ.82 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,65,912 మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేశామన్నారు. అర్హులైన రైతులకు మొదటి విడతలో 53,129 మందికి రూ.290 కోట్లు, రెండో విడతలో 27,875 మందికి రూ.277 కోట్ల పంట రుణాల మాఫీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 499 గ్రామపంచాయతీల్లో ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 980 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి 840 పాఠశాలల్లో రూ.42 కోట్లతో అత్యవసర పనులైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, మరమ్మతులు పూర్తి చేశామన్నారు. పదో తరగతిలో జిల్లాలోని 13,976 మంది విద్యార్థులకు 13,788 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతోపాటు రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాలపై జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మాదక ద్రవ్య రహిత జిల్లాగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు.



సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ మనుచౌదరి, ఎస్పీ అనురాధ



సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



సంగారెడ్డిలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులను సన్మానిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ తదితరులు



సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన చిన్నారులతో మంత్రి, దామోదర, కలెక్టర్ క్రాంతి





సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ మాధురి, చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ పక్కన కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేశ్





సంగారెడ్డి పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన చిన్నారులు

# ప్రజల కలలు సాకారం చేస్తాం

- అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట
- రైతుభరోసా అమలుకు ప్రణాళిక
- సంగారెడ్డిలో త్వరలో 500 పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన
- సంగారెడ్డి స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన కలెక్టర్ వల్లురు క్రాంతి, అడిషినల్ కలెక్టర్లు, ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, ఆగస్టు 15(నమస్తే తెలంగాణ): ప్రజల ఆశలు, ఆకాంక్షలు, కలలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గురువారం సంగారెడ్డి పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి రాజనర్సింహ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఆనవాయితీ ప్రకారం పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 9గంటలకు కచ్చితంగా మంత్రులు జాతీయజెండాను ఎగురవేస్తున్నారు. మంత్రి దామోదర మాత్రం 15 నిమిషాలు ఆలస్యంగా జెండా ఎగురవేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యం, నీటిపారుదల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఆరు గ్యారెంటీల కోసం 17.91 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 1.22 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు తెలిపారు. 1.89 లక్షల మంది మహిళలకు రూ.500కు గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నట్లు చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా 1.03 లక్షల మంది లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. రైతు భరోసా పథకం అమలుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 77,861 మంది రైతులకు రూ.564.69 కోట్లు రుణమాఫీ చేసినట్లు వివరించారు. చేయూత పథకం ద్వారా 1.58 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు రూ.175 కోట్లతో చేపడుతున్నామని, త్వరలో పనులు ముగించి అన్ని భవనాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో రూ.250 కోట్లతో 500 పడకల దవాఖాన నిర్మిస్తున్నామని, ఈ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. మహిళలకు బ్యాంకురుణాలు, స్త్రీనిధి రుణాలు, వడ్డీలేని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.168 కోట్లతో సింగూరు కాల్వల లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రూ.24 కోట్లతో నల్లవాగు ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మంత్రి దామోదర రాజనర్సింహ తన ప్రసంగంలో అంబేద్కర్, నెల్సన్‌మండేలా మాటలను ఊటంకించారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు అందజేస్తున్న మంత్రి రాజనర్సింహ, పక్కన కలెక్టర్ వల్లూరు క్రాంతి

## పోలీసులకు సేవా పతకాలు ప్రదానం

సంగారెడ్డి, ఆగస్టు 15: పోలీసు విభాగంలో ఉత్తమ సేవలందించిన పోలీసు సిబ్బందికి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పతకాలు ప్రదానం చేశారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో పోలీసులకు పతకాలు పంపిణీ చేశారు. పతకాలు అందుకున్న వారిలో ఉత్తమ సేవ పతకంలో ఎస్‌బీ ఎస్సై యాదవరెడ్డి, ఆర్‌ఎస్సైలు ఖదీరుద్దీన్, సంజీవరెడ్డి, ఏఎస్సై సంజీవ్, ఐటీ సెల్ హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ ఉన్నారు. సేవా పతకాల్లో పటాన్‌చెరు ఎస్సై అభిమాన్ సింగ్, ఆర్ ఎస్సై సలాం, ఏఎస్సైలు జగదీశ్, వేణుగోపాల్, లక్ష్మారెడ్డి, ఏఆర్ ఎస్సై నాగార్జున, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, గోపాల్, ప్రేమ్ కుమార్, శివకుమార్, షేక్ ముక్తార్ ఉన్నారు. అనంతరం పోలీసు విభాగంలో ఉత్తమ సేవలందించిన ప్రతిఒక్కరినీ అభినందించారు.

# నేనే డీఐఈవో..కాదు నేనే..


- సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖలో గందరగోళం
- డీఐఈవో పోస్టుకు ఇద్దరు అధికారుల పోటీ
- అయోమయ స్థితిలో అధికారులు, సిబ్బంది
- కలెక్టర్ సమ్మతితో డీఐఈవోగా హిమబిందు కొనసాగింపు
- హిమబిందుకు షోకాజ్ నోటీసులు జారీచేసిన రాష్ట్ర ఉన్నతాధికారులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 15: సిద్దిపేట జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యాశాఖలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. నేనంటే.. నేనని ఇద్దరు అధికారులు డీఐఈవో పోస్టుకు పోటీపడ్డారు. చివరికి జిల్లా కలెక్టర్ కల్పించుకొని పరిస్థితిని చక్కదిద్దినట్టు తెలుస్తుంది. జూన్ 30న జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో) సూర్యప్రకాశ్ ఉద్యోగ విరమణ చేశారు. బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుకు ఇన్‌చార్జి డీఐఈవోగా బాధ్యతలు అప్పగించారు. జూలై చివరి వారంలో హిమబిందు సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆగస్టు 6న కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డికి డీఐఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆగస్టు 8న డీఐఈవోగా రవీందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇంతలో ఇన్‌చార్జి డీఐఈవో హిమబిందు హైకోర్టుకు వెళ్లి తననే డీఐఈవోగా కొనసాగించాలని కోర్టు ద్వారా స్టేటస్ కో తెచ్చుకుంది. దీంతో నాలుగు రోజులుగా ఇద్దరూ డీఐఈవోగా విధులు నిర్వహిస్తూ.. ఎవరికి వారే అధికారులతో సమావేశాలు, సమీక్షలు, తనిఖీలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ మనుచౌదరి కలుగజేసుకొని హిమబిందు కొనసాగాలని ఆదేశించారు. ప్రవర్తనా నియమావళి కింద ఇంటర్ విద్యాశాఖ సంచాలకులు శృతి ఓజా బుధవారం హిమబిందుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హిమబిందుపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని నోటీసుల్లో ఆమె పేర్కొన్నారు.

# లక్ష్మారెడ్డి ఆశయ సాధనకు కృషి

## వర్ధంతిలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఆగస్ట్ 15: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో దివంగత మాజీ జడ్పీటీసీ వాకిటి లక్ష్మారెడ్డి 25వ వర్ధంతిని శుక్రవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మారెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, లక్ష్మారెడ్డి అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వాకిటి లక్ష్మారెడ్డి పేదల సంక్షేమానికి కృషిచేశారని, వారికోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు గుర్తుచేశారు. లక్ష్మారెడ్డిపై అభిమానంతో అశేష సంఖ్యలో తరలివచ్చి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అభిమానులకు, కార్యకర్తలకు, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విద్యా వికాస్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీకోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు సంతోష్‌రెడ్డి, ప్రముఖ వైద్యుడు రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు భిక్షపతి, నాయకులు గోపి, సూరారం నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్, నాగరాజుగౌడ్, రాకేశ్‌గౌడ్, రాజేశ్, మాజీ వైస్‌ఎంపీపీ నర్సింగరావు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సిద్దిపేట, ఆగస్టు 15: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. 9.40 గంటలకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాత్రంత్య సమరయోధులు లక్ష్మి, పద్మ, సరోజన, ఓజమ్మ, లింగయ్య, ఆగంరెడ్డి, వెంకట్‌రెడ్డి,రాంరెడ్డి, కిష్టయ్యను సన్మానించారు. 10.15 గంటలకు అగ్నిమాపక శాఖ సిబ్బంది గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా శాఖల శకటాలను ప్రదర్శించారు. 11స్టాళ్లను ఏర్పాటు చేయగా, వాటిని మంత్రి సందర్శించారు. అనంతరం 239 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఆందించి, అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, ఆధికారులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.




సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ మైదానంలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఆయిల్ కొనుగోలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

## ఆకట్టుకున్న శకటాలు, స్టాళ్ల ప్రదర్శన

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 15: సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య వేడుకల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్‌తో కలిసి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులను మంత్రి దామోదర సన్మానించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన ఆకట్టుకున్నది. మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సందర్శించారు.

# ఆకునూరులో డెంగీ విజృంభణ

## గ్రామంలో 15కు పైగా కేసులు నమోదు..?



ఆకునూరు డ్రైనేజీలో పేరుకుపోయిన సీసాలు, కవర్లు

చేర్యాల, ఆగస్టు 15: చేర్యాల నియోజకవర్గంలో మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో గ్రామస్తులు జ్వరాల బారిన పడ్డారు. కొన్ని రోజులుగా 60మందికి పైగా గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపించి దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. జలుబు,దగ్గు, టైఫాయిడ్, డెంగీ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు తెలిపారు. జ్వరాల బారినపడ్డ వారిలో డెంగీ లక్షణాలు కనిపించడంతో వైద్యుల సూచన మేరకు రోగులు ప్రైవేటు దవాఖానల్లో పరీక్షలు చేయించుకోవడంతో వారికి డెంగీ పాజిటివ్ వస్తున్నాయి. గ్రామంలో 15 మందికి పైగా డెంగీ పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. ఇందులో కొందరు హైదరాబాద్, సిద్దిపేటలోని దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ఆకునూరులోని ఆరోగ్య ఉపకేంద్రం(పల్లె దవాఖాన)లో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సరిగ్గా సేవలు అందించడం లేదని, వారంలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే విధులకు వచ్చిపోతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.